

షాపూర్‌నగర్ డీసీపీ కార్యాలయం సమీపంలో ట్రాఫిక్‌జాం..

షాపూర్‌నగర్‌లో ట్రాఫిక్ టెన్షన్

జీడిమెట్ల: నిబంధనలు పాటించకుండా ఆటోలు విచ్చలవిడిగా తిరుగుతుండటంతో షాపూర్‌నగర్‌లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుందని వాహనదారులు అంటున్నారు. షాపూర్‌నగర్‌లోని డీసీపీ కార్యాలయం సమీపంలో గాజులరామారం వెళ్లే ఆటోవాలాలు రోడ్డుకు అడ్డంగా ఆటోలు నిలుపుతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ఆటోల వలన ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుందని వాహనదారులు అంటున్నారు. ఇంటికి, ఆఫీసులకు వెళ్లాల్సిన వాహనదారులు ట్రాఫిక్ వలన పది నిమిషాల పాటు ట్రాఫిక్‌లో ఇరుక్కుంటున్నారు. కొన్నిసార్లు ఆటో డ్రై వర్లను వాహనదారులు మందలిస్తే వారు గొడవలకు దిగుతున్నారని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకుని సమస్యకు చెక్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ నేతలు



నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ రాజ్ ఠాకూర్‌ను ఆయన స్వగృహంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు బోకే అందజేసి శాలువతో సత్కరించారు. జూలకంటి లక్ష్మారెడ్డి, వంశీ, ప్రేమ్ కుమార్ తదితరులు ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్థిక సహాయం అందజేసిన కార్పొరేటర్



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ మరియమ్మ నగర్‌లో నివాసముంటున్న హేమ లక్ష్మణ్ రావు, అంబికల కుమార్తె శృతి వివాహానికి డివిజి ట్రస్ట్ ద్వారా 5 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, పద్మయ్య,, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలాధారులకు అన్నదానం



రంగారెడ్డినగర్: జీడిమెట్ల డివిజన్ వైష్ణవి ఎన్‌క్లేవ్‌లోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం వార్డు మెంబర్ రంగు కవిత ఆధ్వర్యంలో అయ్యప్ప మాలాధారులకు అన్నదానం ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న అయ్యప్పలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భిక్ష స్వీకరించారు. అయ్యప్పస్వాముల భక్తిగీతాలు, భజనలతో వైష్ణవి ఎన్‌క్లేవ్‌లో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది.

కోడింగ్ ఈవెంట్‌తో విద్యార్థుల నైపుణ్యం గుర్తించవచ్చు

ఘట్‌కేసర్: కోడింగ్ ఈవెంట్‌తో విద్యార్థుల కోడింగ్ నైపుణ్యం గుర్తించవచ్చని హెచ్ఓడీ మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ విభాగం ఐఈఈఈ–సీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్లైండ్ కోడింగ్ ఈవెంట్‌కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈవెంట్‌లో 180 మంది విద్యార్థులు పోటీ పడగా విజేతగా సీఎస్ఈ నుంచి శ్రేయరెడ్డి, ఏఐ నుంచి రన్నరప్‌గా నిలిచిన కీర్తనను డీన్ విజయ్‌కుమార్ అభినందించారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డాక్టర్ తృప్తి, విద్యార్థి సమన్వయకర్తలు ఐశ్వర్య, కార్తీక్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి నేతల శుభాకాంక్షలు



దుండిగల్: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఎనుముల రేవంత్‌రెడ్డిని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నేత, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రేవంత్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

ఆస్తి పన్ను వసూళ్లపై దృష్టి



కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల మున్సిపల్ కార్యాలయం

కుత్బుల్లాపూర్: ఆస్తి పన్నుల వసూళ్లలో సర్కిల్ అధికారులు తలమునకలయ్యారు. గత నెల రోజులుగా అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా విధులు నిర్వహించిన అధికారులు ఇప్పుడు ఆస్తి పన్నుల వసూళ్లపై దృష్టి సారించారు. ముఖ్యంగా ఆస్తి పన్ను చెల్లించండి.. అభివృద్ధికి సహకరించండి.. అనే నినాదంతో ముందుకు సాగుతున్నారు. జంట సర్కిళ్లైన గాజులరామారం, కుత్బుల్లాపూర్ ప్రాంతాల్లోని 8 డివిజన్లలో ఇప్పటికే అవగాహన సదస్సులు నిర్వహించారు. ఆయా సెక్టార్ల వారీగా కేటాయించిన ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు పన్నులను సేకరించే పనిలో ఉపక్రమించారు. కాగా ఆన్‌లైన్, జీహెచ్ఎంసి యాప్‌ల ద్వారా సైతం పన్నులు చెల్లించే విధంగా ప్రజలకు వివరిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంతో కొంత మేరకు వెనుకబడినా ప్రస్తుతం సర్కిల్ అధికారులు పూర్తి స్థాయిలో పన్నుల వసూళ్ల విషయంలో దృష్టి కేంద్రీకరించారు. తాము ఎంచుకున్న టార్గెట్‌ను రీచ్ అయ్యే విధంగా ప్రణాళికలను రూపొందించుకుని ముందుకు సాగుతున్నారు. వంద శాతం పన్నుల వసూళ్లే లక్ష్యంగా పని చేస్తున్నారు. గాజులరామారం సర్కిల్ పరిధిలో రూ.34 కోట్లకు గాను రూ.18 కోట్లను వసూలు చేశారు. ఈ డిసెంబరు నెలలో రూ.4.44 కోట్లు టార్గెట్‌గా నిర్దేశించుకుని పని చేస్తున్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో రూ.57.38 కోట్లకు గాను రూ 24.38 కోట్లను వసూలయ్యాయి. ఈ నెలలో రూ.6.60 కోట్ల వసూళ్లను లక్ష్యంగా పెట్టుకున్నారు.

సకాలంలో పన్ను చెల్లించాలి



ఆస్తి పన్నులను సకాలంలో చెల్లించి అధికారులకు సహకరించాలి. ఇప్పటి వరకు గాజులరామారం సర్కిల్‌లో రూ.34 కోట్లకు గాను రూ.18 కోట్లు వసూలయ్యాయి. మిగిలిన రూ.16 కోట్లను వసూలు చేసే విధంగా అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారు. డిసెంబర్ నెలలో విధించిన టార్గెట్‌ను ప్రతి ఒక్క సిబ్బంది చేధించే విధంగా అధికారులు కృషి చేస్తున్నారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన సిఎస్‌సి కేంద్రంలో గాని ఆన్‌లైన్ ద్వారా గాని చెల్లించవచ్చు..

–మల్లారెడ్డి, గాజులరామారం ఉప కమిషనర్

ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం



కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో మొత్తం రూ 57.38 కోట్లకు గాను రూ 33 కోట్లు వసూలయ్యాయి. ఎన్నికల నేపథ్యంలో నెల రోజులుగా వసూళ్లు తగ్గాయి. ఇప్పుడు తిరిగి వసూళ్లను వేగవంతం చేశాం. మిగిలిన రూ.24.38 కోట్లను వసూలు చేసేందుకు ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేశాం. ఈ నెలలో రూ.6.60 కోట్లను టార్గెట్‌గా పెట్టుకుని పని చేస్తున్నాం. వంద శాతం ఫలితాలు సాధించే విధంగా కృషి చేస్తున్నాం.

– నాగమణి, కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్

స్కేటింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో సత్‌జ్ఞాన్ స్కూల్ కరస్పాండెంట్ చింతల మల్లేశం

కుత్బుల్లాపూర్: మదాపూర్‌లో జరిగిన ఇంటర్ స్కూల్ స్కేటింగ్ కాంపిటీషన్‌లో చింతల్ వెంకటేశ్వరనగర్‌కు చెందిన సత్‌జ్ఞాన్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బాలుర విభాగంలో (8–10 వయసు) 300మీటర్స్ స్కేటింగ్‌లో మాస్టర్ సాయి పవన్ గోల్డ్ మెడల్ సాధించగా వెంకటసాయి అప్రిషియేషన్ సర్టిఫికేట్ అందుకున్నాడు. 10–12 ఏళ్ల వయస్సు విభాగం 500 మీటర్స్ స్కూటింగ్‌లో పోటీల్లో దినేష్, ఆర్యన్ రాహుల్ బుతాలే ఇద్దరు మొదటి స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్స్, సామిత్ రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్, షేక్ ముస్తఫా, మోహిత్ లు బ్రాంజ్ మెడల్ సాధించారు. 12–14 వయస్సు 500 మీటర్స్ విభాగంలో మోహన్, షేక్ ముబారక్, హితేష్ కుమార్ లు సిల్వర్ మెడల్, జయంత్, చరణ్ కుమార్, మనోజ్ కుమార్‌లు బ్రాంజ్ మెడల్స్ సాధించారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరస్పాండెంట్ లయన్ చింతల మల్లేశం విద్యార్థులను అభినందించారు. తమ పాఠశాలలో విద్యతో పాటు ఆటపాటలకు సమ ప్రాధాన్యత ఇస్తామని, విద్యార్థుల కఠోర దీక్ష, శిక్షకుల కృషితోనే స్కేటింగ్‌లో మెడల్స్ సాధించడం సాధ్యపడిందన్నారు.

ప్రభుత్వ భూమి కాపాడాలని గ్రామస్తుల ధర్నా

అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతి

సాక్షి, మేడ్చల్ జిల్లా: 15 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడాలని శుక్రవారం కలెక్టరేట్ ఎదుట అద్రాస్‌పల్లి పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులతో కలిసి గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని మూడుచింతలపల్లి మండలం అద్రాస్‌పల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబరు–235లో ఉన్న 15 ఎకరాల ప్రభుత్వ భూమి మూడేళ్లుగా కబ్జాదారుల ఆధీనంలో ఉందని, ఆ భూమిని కాపాడాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులకు తెలిపినా.. పట్టించుకున్న దాఖలాలు లేవని వారు తీవ్రంగా దుయ్యబట్టారు. ప్రజావాణిలో కూడా పలుమార్లు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు వారు పేర్కొన్నారు. గ్రామపంచాయతీ పాలకవర్గం ద్వారా కూడా ప్రజావాణిలో అభ్యర్థన లేఖలను పలుమార్లు అందజేసినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన 15 ఎకరాల ప్రభుత్వ భూమి ఇప్పటికీ కబ్జాదారుల ఆధీనంలోనే ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామస్తుల డిమాండ్ మేరకు గురువారం గ్రామపంచాయతీ పాలకవర్గం సమావేశంలో ఆక్రమదారుల నుంచి 15 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడాలని తీర్మానించి, సంబంధిత జిల్లా అధికారులకు నివేదించినట్లు వారు తెలిపారు. ధర్నా అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఆందోళనలో గ్రామ సర్పంచ్ బోయిని లలిత, వార్డు సభ్యులు కవిత, శ్రీను, నాగలక్ష్మి, నాగరాజు, రాజు, శ్రీను, లక్ష్మీ, మనెమ్మ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓల్డ్ ఏజ్ హోమ్ ప్రారంభం

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని మిత్ర హిల్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రేస్ ఓల్డ్ ఏజ్ హోమ్‌ను శుక్రబారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులకు అన్ని రకాల వసతులతో, సకల సౌకర్యాలతో వృద్ధాశ్రమం ఏర్పాటు చేయటం అభినందనీయమని కొనియాడారు.

వీల్‌చైర్ అందజేత

జీడిమెట్ల: అవసరం ఉన్నవారికి సహాయం చేయడం మానవ కర్తవ్యమని విప్లవజ్యోతి అల్లూరి పౌండేషన్ ఉపాధ్యక్షుడు జంగా తాతాజీ అన్నారు. సూరారం కృషికాలనీకి చెందిన తారమ్మ కొంతకాలంగా ఆమె రెండు కాళ్లు పనిచేయకపోవడంతో బిక్షాటన చేస్తూ బతుకుతోంది. ఆమెకు వీల్‌చైర్ అవసరం ఉందని స్థానికుల ద్వారా విప్లవజ్యోతి పౌండేషన్ సభ్యులు తెలుసుకున్నారు. పౌండేషన్ సభ్యులు ఈ విషయాన్ని దాతలకు తెలపగా శుక్రవారం ఎస్.ఆర్ నాయక్‌నగర్‌కు చెందిన సుబ్బారావు తారమ్మకు వీల్ చైర్‌ను అందజేశారు.

ఆలయంలో విశేష పూజలు



జగద్గిరిగుట్ట: కార్తీక మాస ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం జగద్గిరిగుట్ట డివిజన్ ఫిర్దిహిల్స్‌లోని శ్రీలీలాద్రి క్షేత్ర నృసింహస్వామి ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆలయ ఆవరణలో విష్ణు సహస్రనామ పారాయణం చేశారు.

11 నుంచి హెచ్‌సీయూలో బయోటెక్ సమ్మిట్

రాయదుర్గం: హెచ్‌సీయూలో ఈనెల 11వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫార్మా అండ్ బయోటెక్ సమ్మిట్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్స్(ఎఫ్ఏబీఏ), సైన్స్ గురుస్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ సంయుక్త ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహిస్తారు ఈ కార్యక్రమంలో ప్రారంభ ప్రత్యేక ఉపన్యాసాన్ని ఇన్‌వెని ఏఐ ప్రతినిధి డాక్టర్ కృష్ణన్ నందబాలన్, ఐ స్పిరిట్ ప్రతినిధి డాక్టర్ సును ఇంజనీర్, బ్రేన్ ఎంటర్‌ప్రైజెస్ ప్రతినిధి డాక్టర్ వాసుదేవవర్మ, సైంజీన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ డాక్టర్ మహేష్ భల్గాట్ ప్రసంగిస్తారని ఎఫ్ఏబీఏ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ పి రెడ్డన్న వివరించారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది. 'యాంగర్ ఫ్రీ లైఫ్ స్టైల్' అనే అంశంపై సీనియర్ రాజయోగ టీచర్ బి.కె.కవిత ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాల కోసం 040–23001234లో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

11న కార్తీక దీపోత్సవం

రాయదుర్గం: కార్తీకమాసాన్ని పురస్కరించుకొని రాయదుర్గంలోని వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం కార్తీక దీపోత్సవంను నిర్వహిస్తామని నాగార్జున ఉన్నత పాఠశాల అధినేత ఏ భరత్‌కుమార్ తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి పాఠశాల చైర్మన్ ఏ కృష్ణ ఆధ్వర్యంలో త్రిదండి శఠగోప రామానుజ జీయర్ స్వామి, ఋగ్వేదం సలక్షణ ఘనాపాఠి సందుగుల రాఘవాచార్యుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం సాగుతుందన్నారు. ఈ సందర్భంగా సహస్ర నామ పుష్పార్చన, భక్తులచే మహా రుద్రాభిషేకం, హనుమాన్ ఆలయం నుంచి స్వామి ఊరేగింపును నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 5 గంటలకు వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం ఉంటుందని వివరించారు. ఏక హారతి, నక్షత్ర హారతి, మహా హారతి, కుంభ హారతి వంటి ప్రత్యేక కార్యక్రమాలను కూడా నిర్వహిస్తామన్నారు.

డ్రైనేజీ పైపులైన్ పనులు పూర్తయ్యేదెన్నడు?



గురుమూర్తినగర్- గిరినగర్ రోడ్డులో వృథాగా మిగిలిపోయిన భూగర్భ డ్రైనేజీ పైపులు..



గిరినగర్‌లో ఓ ఇంటిని ఆనుకుని డంప్ చేసిన డ్రైనేజీ పైపులు



పనుల కోసం గిరినగర్‌లో రోడ్డును ధ్వంసం చేసిన దృశ్యం

రంగారెడ్డినగర్: భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనులకు బాలారిష్టాలు తప్పడం లేదు.. గత ఆరు నెలలుగా సదరు పనులు ఒకడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కి అన్న చందంగా మారాయి.. ఒకసారి వర్షాలు కురుస్తున్నాయని పనులను ఆపితే, మరోసారి ఎన్నికల కోడ్‌తో నిలిపోయాయి. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గురుమూర్తినగర్– గిరినగర్ రోడ్డు నుండి గిరినగర్‌లోని పోచమ్మ ఆలయం వరకు దాదాపు 25 లక్షల నిధులతో భూగర్భ డ్రైనేజీ పనులకు ఆరు నెలల క్రితం శంకుస్థాపన చేశారు. అయితే పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ రెండు నెలల పాటు ఏ పనులు చేపట్టకుండా కాలం వెల్లదీశాడు. సెప్టెంబరు నెలలో తీరా పనులు చేపట్టేందుకు రోడ్డును కొంత మేర ధ్వంసం చేయగా వర్షాలు పడుతున్నాయని జలమండలి అధికారులు నిలుపుదల చేశారు. ఇలా జాప్యం కొనసాగుతూ రాగా ఎన్నికల కోడ్ వచ్చింది. దీంతో అప్పటి నుండి భూగర్భ డ్రైనేజీ పనులు ముందుకు సాగడం లేదు.

రోడ్డు ధ్వంసంతో రాకపోకలకు ఇబ్బందులు..

గిరినగర్‌లోని పోచమ్మ ఆలయం వరకు పనులు చేపట్టేందుకు కొంత మేర రోడ్డును ధ్వంసం చేశారు. సుమారు పర్లాంగ్ మేర రోడ్డు పెచ్చులూడి ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కరంగా మారింది. జలమండలి అధికారులను పనుల విషయమై స్థానికులు అడిగితే సమాధానం దాటవేస్తున్నారని, సదరు కాంట్రాక్టర్ తమ ఇళ్ల ముందు పైపులు ఉంచి కనిపించకుండా పోయాడని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిధులు విడుదలైన పనులకు ఇంత జాప్యం ఎందుకు చేస్తున్నారని, చిన్నపాటి వర్షాలకు పనులు ఆపి వేశారని, తీరా పనులను ప్రారంభించేలా లోపు ఎన్నికల కోడ్ నెపంతో రెండో సారి పనులు నిలిచిపోయాయని, ఇంకెన్ని రోజులు భూగర్భ డ్రైనేజీ పనులను సాగదీస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా యుద్ధ ప్రాతిపదికన పైపులైన్ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం



గాంధీనగర్‌లోని హనుమాన్ ఆలయం వద్ద లీకేజీతో వృథాగా పోతున్న తాగునీరు

రంగారెడ్డినగర్: తాగునీటి పైపులైన్ పనుల్లో అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా పనుల పూర్తి చేసి చేతులు దులుపుకుంటున్నారు. రంగారెడ్డినగర్ డివివిజన్ గాంధీనగర్‌లో ఇటీవల భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనులు పూర్తి చేశారు. శుక్రవారం కొత్త పైపులైన్‌కు నీటి సరఫరా చేయగా హనుమాన్ దేవాలయం వద్ద లీకేజీ ఏర్పడి పెద్ద మొత్తంలో నీరు వృథాగా పోయింది. ఈ విషయమై స్థానికులు సంబంధిత లైన్‌మెన్‌కు సమాచారం అందించినా స్పందించకపోవడంతో నీటి సరఫరా కొనసాగినంత సేపు తాగునీటి వృథా కొనసాగింది. పనులు పూర్తయిన తరువాత ట్రయల్ రన్ నిర్వహించకుండా అధికారులు వ్యవహరించిన నిర్లక్ష్యం కారణంగానే నీరు వృథాగా పోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మాక్ అసెంబ్లీ



కుత్బుల్లాపూర్: శ్రీచైతన్య కొంపల్లి–3 బ్రాంచ్ పాఠశాలలో శుక్రవారం మాక్ అసెంబ్లీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎమ్మెల్యేగా తరహాలో సమకాలిన పరిస్థితులు, సమస్యలపై చర్చించి అబ్బుర పరిచారు. ఈ సందర్భంగా కొంపల్లి జోన్ శ్రీచైతన్య విద్యా సంస్థల జీఎం రమణారావు మాట్లాడుతూ విద్యార్థులకు సమకాలిన పరిస్థితులపై ఉన్న అవగాహన, వారిలో సృజనాత్మకతను వెలికి తీయడానికి మాక్ అసెంబ్లీ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పాఠశాల కో.ఆర్డినేటర్లు జైపాల్‌రెడ్డి, సీతారామిరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు లావణ్య, డీన్ శ్రీకాంత్‌రెడ్డి, సివిల్స్ ఇంఛార్జి సుభాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

దుండిగల్: తాము కనుకొన్న ఉత్పత్తికి సంబంధించిన పేటెంట్ పొందే హక్కు వ్యవస్థాపకుడికి ఉంటుందని ఎంఎల్ఆర్ఐటి విద్యా సంస్థల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి అన్నారు. దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో మేధో సంపతి హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో 150 మందికి పైగా చిన్న పరిశ్రమల వ్యాపారులు, ఔత్సాహికులు పాల్గొన్నారు. సొంతంగా తయారు చేసిన ఉత్పాదకాలపై పేటెంట్ ఏ విధంగా పొందాలన్న విషయంపై వివరించారు. కార్యక్రమంలో ఎంఎల్ఆర్ఐటి కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్‌రావు, డైరెక్టర్ మర్రి శ్రేయా రెడ్డి, విజయ్‌భాస్కర్‌రెడ్డి, రాధికాదేవి, వివేకానంద్, ఎం. గుప్త. నర్సింహులు, వై.బలరాం తదితరులు పాల్గొన్నారు.

దళితులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

నిజాంపేట్: గత ప్రభుత్వాలు దళితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేశాయని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని నెరవర్చేందుకు కృషి చేయాలని కేవీపీఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు కృపాసాగర్, కార్యదర్శి బాలపీరు అన్నారు. శుక్రవారం బాచుపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళితులకు 3 ఎకరాల భూమి ఇస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. దళిత బంధు పథకాన్ని నిజమైన లబ్ధిదారులకు కాకుండా తమ అనూయులకే కట్టబెట్టారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలైన దళితులకు ఇళ్లు, స్థలాలతో పాటు ఎస్సీ కార్పొరేషన్ బకాయిలను రద్దు చేయాలని, అదే విధంగా మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో చాలా మంది పేదలు ఇబ్బందులు పడ్డారని, రాష్ట్ర ప్రజల ఆశయాలకు అనుగుణంగా కొత్త ప్రభుత్వం పని చేయాలని కోరారు.

దుండిగల్‌లో చోరీ



వివరాలు సేకరిస్తున్న పోలీసులు..

దుండిగల్: ఓ ఇంట్లో దొంగలు పడి 3 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. దుండిగల్ మున్సిపాలిటీ చర్చిగాగిల్లాపూర్‌లో నివాసమున్న గుండ నర్సయ్య ఈ నెల రెండవ తేదీన నర్సయ్య తన భార్యతో కలిపి నిజాంపేటలో ఉంటున్న తన కుమారుడి ఇంటికి వెళ్లాడు. తిరిగి 7వ తేదీన ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా మూడు తులాలు విలువ చేసే బంగారు ఆభరణాలు, వెండి అపహరణకు గురైనట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కార్న్ బర్సర్ పరికరం అందజేత

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ సెట్ కళాశాల విద్యార్థుల బృందం తయారు చేసిన కార్న్ బర్సర్ పరికరాన్ని మండలంలోని మునీరాబాద్ గ్రామానికి చెందిన తారాబాయ్‌కి అందజేశారు. ప్రజల సమస్యలకు సాంకేతిక పరిష్కారం చూపేందుకు గాను కళాశాల అధ్యాపకులు సురేశ్‌రామ్, రవికిరణ్ పర్యవేక్షణలో విద్యార్థులు శ్రీరామ్, దీపిక, శశికుమార్, తేజశ్రీ, కృతిక బృందం సోలార్‌తో పనిచేసే మొక్కజొన్న పొత్తులు వేరుచేసే పరికరాన్ని తయారు చేశారు. గురువారం గ్రామ సర్పంచ్ గణేశ్, ఉపసర్పంచ్ నర్సింగ్‌రావుతో కలిసి విద్యార్థుల బృందం గ్రామానికి చెందిన వ్యాపారి తారాబాయ్‌కి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కజొన్న పొత్తులు వేరుచేసే సమయంలో రైతులు ఇబ్బంది పడే శ్వాసకోశ వ్యాధులు, చేతినొప్పి సమస్యలు ఈ పరికరంతో తొలగిపోతాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణ, దేవదాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

మున్సిపల్ ఛైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: ప్రజలకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని మున్సిపల్ ఛైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపాలిటీ విద్యుత్ కార్మికులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక కౌన్సిలర్లతో కలిసి విద్యుత్ తీగల కింద ఉన్న ఇళ్లు, నూతనంగా అవసరమైన చోట్ల విద్యుత్ దీపాల ఏర్పాటు తదితర సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు మాదేవి, ఆంజనేయులుగౌడ్, రవీందర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాకేశ్, మున్సిపాలిటీ కార్మికులు పాల్గొన్నారు.

నేడు మానవ హక్కులపై అవగాహన

రాయదుర్గం: వరల్డ్ హ్యూమన్ రైట్స్ డేను పురస్కరించుకొని శనివారం ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కన్వీనర్ టి రామస్వామి యాదవ్ తెలిపారు. కొత్తగూడ సఫారినగర్‌లోని న్యూబ్లూమ్ హైస్కూల్‌లో ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉర్దూ విశ్వవిద్యాలయం పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్ అఫ్రోజ్ ఆలమ్ ముఖ్య అతిథిగా విచ్చేసి అవగాహన కల్పిస్తారని వివరించారు.